క్లుప్తంగా

పీసీసీ చీఫ్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



బాన్సువాడ : పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను గురువారం బాన్సువాడ కాంగ్రెస్ నేతలు కలిశారు. బాన్సువాడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మంత్రి అంజవ్వతో పాటు డైరెక్టర్లను నియమించినందుకు పీసీసీ చీఫ్‌ను సన్మానించారు. పీసీసీ చీఫ్‌ను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు యలమంచిలి శ్రీనివాస్‌రావు, ప్రతాప్‌సింగ్, మంత్రి గణేష్, భాస్కర్‌రెడ్డి, కమ్మ సత్యనారాయణ, అంజాద్‌ఖాన్, భాను తదితరులున్నారు.

బీజేపీలో చేరిన ఎన్‌ఆర్‌ఐ శశాంక్



బాన్సువాడ: ఎత్తొండ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ కోనేరు శశాంక్ గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార సమక్షంలో బీజేపీలో చేరారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, దేశ అభివృద్ధిలో భాగమయ్యేందుకు పార్టీలో చేరినట్లు శశాంక్ తెలిపారు. ప్రజలకు సేవ చేయాలన్నదే తన లక్ష్యమని అన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, ఆయా మండలాల అధ్యక్షులు శంకర్, సున్నంసాయిలు తదితరులున్నారు.

బూత్ లెవల్ కమిటీ ఎన్నిక

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పుల్కల్, శెట్లూర్ గ్రామాలలో గురువారం బీజేపీ నాయకులు బూత్ లెవల్ కమిటీ నియమించారు. నాయకులు విష్ణు, పండరి జాదవ్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో బూత్ లెవల్ కమిటీ వేస్తున్నామని, స్థానిక ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి అందరు కలిసికట్టుగా కృషి చేయాని కోరారు.

విద్యార్థులు బాగా చదవాలి



ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థులు బాగా చదవాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. గురువారం పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఎంఈవో తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట, తరగతి గదులను పరిశీలించారు. ఎస్‌వో వీణ, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

రుణాలను ఆదాయాభివృద్ధికి వినియోగించుకోవాలి

రాజంపేట: గ్రామ సంఘాలలో రుణాలను పొందిన సంఘ సభ్యులు ఆదాయాభివృద్ధికి వినియోగించుకోవాలని ఏపీఎం సాయిలు సూచించారు. రాజంపేట్ మండల కేంద్రంతో పాటు ఆర్గొండ, కొండాపూర్ క్లస్టర్ పరిధిలో గ్రామ సంఘ సమావేశం నిర్వహించి మాట్లాడారు. సంఘాలలో లేని సభ్యుల గుర్తింపు, సంఘాల ఆడిట్ చేయడం, అకౌంటింగ్ యాప్‌లో డేటా ఎంట్రీ, పాల ఉత్పత్తుల అమ్మకం, నువ్వుల లడ్డు తయారీ గురించి, బ్యాంకు లింకేజీల గురించి సంఘ సభ్యులతో చర్చించారు. సీసీ భాగయ్య, శ్రీనివాస్, వీవోఏలు పాల్గొన్నారు.

రాములోరికి పల్లకీ సేవ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని శ్రీరామాలయంలో గురువారం ఆలయ కమిటీ సభ్యులు పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారి విగ్రహాలను పల్లకిలో ఉంచి ఊరేగించారు. పంతులు నారాయణ భరద్వాజ ఆధ్వర్యంలో భజనలు, కీర్తనలు చేస్తూ భక్తులు పల్లకిపై సీతాసమేత రాముల వారిని కొలిచారు.

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ



బాన్సువాడ రూరల్: ఇబ్రాహింపేట్ గ్రామంలోని బస్టాండ్ సమీపంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు గురువారం గ్రామస్తులు, దళితనాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాలెపు నారాయణరెడ్డి, మాలెపు వెంకట్‌రెడ్డి, ఉద్దర హన్మాండ్లు, సాయిలుయాదవ్, పండరి, సాయిరెడ్డి, అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో విలీన కాలనీలు

- సీసీ రోడ్లు, డ్రెయినేజీలు వీధి దీపాలు లేక అవస్థలు
- వసతుల కల్పనపై అధికారులు, పాలకవర్గం శీతకన్ను
- పన్నులు పెంచారు.. అభివృద్ధి మరిచారంటున్న ప్రజలు



ముున్సిపాలిటీలో విలీనమైన కాలనీలో రోడ్ల దుస్థితి

బాన్సువాడ: మున్సిపాలిటీలో విలీనమైతే తమ గ్రామాలు, కాలనీలు అభివృద్ధి చెందుతాయనుకున్న ప్రజలకు నిరాశే ఎదురైంది. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పన్నులు పెరిగాయే తప్ప సౌకర్యాలు సమకూరడం లేదని, సమస్యలను అధికారులు, పాలకవర్గం సభ్యులకు విన్నవించినా స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

కొయ్యగుట్ట, తాడ్కోల్ పంచాయతీల పరిధిలో కొన్ని కాలనీలు..

బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్ట, తాడ్కోల్ గ్రామ పంచాయతీల పరిధిలోని ఆయా కాలనీలను 2019లో బాన్సువాడ మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఈ గ్రామాల పరిధిలోని కాలనీలు మున్సిపాలిటీలో విలీనం కావడంతో 15 వార్డులున్న మున్సిపాలిటీ 19 వార్డులకు చేరింది. ఇస్లాంపుర కాలనీలో కొయ్యగుట్టను, అర్ఫత్ కాలనీలో పంచముఖి హనుమాన్ కాలనీ, వాసవి కాలనీ, తాడ్కోల్ రోడ్డులోని పలు వ్యాపార సముదాయాలు, గృహాలను విలీనం చేశారు.

ఆస్తి పన్ను చెల్లిస్తున్నా..సమకూరని సౌకర్యాలు

విలీన కాలనీల ప్రజలు మున్సిపాలిటీలోని అందరి మాదిరిగానే ఏటా ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. ప్రతి ఏడాది పన్నులు చెల్లిస్తున్నా సౌకర్యాలు సమకూరడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొయ్యగుట్ట, తాడ్కోల్ గ్రామ పంచాయితీలుగా ఉన్నప్పటి పనులే తప్ప..కొత్తగా అభివృద్ధి జరగ లేదని వాపోతున్నారు. మున్సిపాలిటీలో విలీనం చేయడం వల్ల ఆయా కాలనీల ప్రజలకు ఉపాధి హామీ పథకం వర్తించడం లేదు. దీంతో నిరుపేదలకు ఉపాధి కూడా లేకుండా పోయింది.

సమస్యలు ఇవీ..

ఆయా కాలనీలను మున్సిపాలిటీలో విలీనం చేసి నాలుగేళ్లు గడిచినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. కనీస సౌకర్యాలైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు వీధుల్లో ప్రవహిస్తుండడంతో దోమలకు నిలయంగా మారుతున్నాయి. వీధి దీపాలు సరిగా లేకపోవడంతో రాత్రి సమయంలో మహిళలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఇక పారిశుధ్య చర్యలు కూడా అంతంతమాత్రంగానే ఉంటున్నాయి.

నిధులు రాగానే పనులు

ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే విలీన కాలనీలకు కేటాయించి అభివృద్ధి పనులు చేపడతాం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిధులతో చిన్న, చిన్న సమస్యలు పరిష్కరిస్తున్నాం. సమస్యల పరిష్కరించేందుకు నిధుల కోసం ఎదురు చూస్తున్నాం.

– శ్రీహరి రాజు, ఇన్‌చార్జి కమిషనర్, బాన్సువాడ

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



కందర్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పిట్లం/పెద్దకొడప్‌గల్/బిచ్కుంద(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. గురువారం బిచ్కుంద, పిట్లం, పెద్ద కొడప్‌గల్ మండలాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. సబ్ కలెక్టర్ స్వయంగా దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దరఖాస్తుదారుల అన్ని వివరాలు తప్పులు లేకుండా యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు మండల, గ్రామ ప్రత్యేక అధికారులు సర్వేలను పరిశీలించాలని సూచించారు. సర్వేలో ఉన్న నిబంధనలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు.

మున్నూరుకాపు సింహగర్జన పోస్టర్ల ఆవిష్కరణ



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం భవనంలో గురువారం మున్నూరుకాపు సింహగర్జన పోస్టర్లను సంఘం నేతలు ఆవిష్కరించారు. ఈ నెల 16న బిచ్కుంద మండల కేంద్రంలో జరిగే మున్నూరుకాపు సింహగర్జనకు మండలంలోని మున్నూరుకాపు కులస్తులు అందరూ తరలిరావాలని వారు కోరారు. సంఘం ప్రతినిధులు పాకల విజయ్, రాజు, విజయ్, శ్రీనివాస్, హన్మాండ్లు, అశోక్, సంతోష్ తదితరులున్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



కామారెడ్డి రూరల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కళాబృందం సభ్యులు ప్రభాకర్ అన్నారు. కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం, సైబర్ క్రైం, ఎహెచ్‌టీయూ గురించి అవగాహన కల్పించారు. షీటీం నెంబర్ 8712686094, సైబర్ నేరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలన్నారు. ప్రతి మహిళ టీ–సేఫ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

పోలింగ్ స్టేషన్ల జాబితాపై సమావేశం



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

దోమకొండ: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గ్రామాల వారీగా పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించిన జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు రాలేవని ఎంపీడీవో చెప్పారు. అన్ని జీపీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో నోటీస్ బోర్డులపై ఈ నెల 7 నుంచే పోలింగ్ స్టేషన్ల జాబితా ఉంచామన్నారు. నాయకులు అనంత్ రెడ్డి, తిర్మల్ గౌడ్, భూపాల్ రెడ్డి, బొమ్మెర శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, సీతారాం మధు, రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాచారెడ్డి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకుడు

తండాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

మాచారెడ్డి: మండలంలోని పలు తండాల్లో పోలింగ్ కేంద్రాలు లేక ఆయా తండాలవాసులు ఇబ్బందులు పడుతున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు హరిలాల్ అన్నారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో గోపి బాబుకు వినతి పత్రం అందజేశారు. మర్రి తండా, నెమలిగుట్ట తండా, సర్దాపూర్ తండా, వెనుక తండా, బోడగుట్ట తండా జీపీలలో ఎలాంటి పోలింగ్ కేంద్రాలు లేకపోవడంతో 3 కిలో మీటర్ల దూరం వెళ్లి ఓటు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, చర్యలు తీసుకోవాలని కోరారు.

పిండిగిర్ని, మిక్సర్ గ్రైండర్ యూనిట్ ప్రారంభం



భిక్కనూరు: సిద్దరామేశ్వరనగర్‌లో ఆదిలక్ష్మి అనే మహిళకు పీఎంఎఫ్‌ఎంఈ యూనిట్ కింద మంజూరైన పిండి గిర్ని, మిక్సర్ గ్రైండర్ యూనిట్‌ను కెనరా బ్యాంక్ మేనేజర్ రవి కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి నూతన రుణాలను పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ నితిన్ కుమార్, డీపీఎం వకుళ, ఏపీఎంలు రాజేందర్, శ్రీనివాస్, సీసీ స్వాతి, ముత్యం, వీవోఏ శైలజలు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోవడం కేవీఆర్‌కే సాధ్యం



భిక్కనూరు: ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్‌కే సాధ్యమని బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు గోల్కొండ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం అంతంపల్లి గ్రామంలో పోచమ్మ ఆలయం వద్ద నిర్మిస్తున్న ప్రహరీ పనులకు భూమి పూజ చేసి ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కేవీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం తన సొంత నిధులు రూ.3 లక్షలు వెచ్చించి ఈ ప్రహరీ నిర్మాణం చేయిస్తున్నాడన్నారు. రానున్న రోజుల్లో కామారెడ్డి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను రూపొందించాడన్నారు. బీజేపీ నేతలు పిట్ల రాజయ్య, సాయిరెడ్డి, భూపతి, అమృత్‌రెడ్డి, మల్లారెడ్డి పేట శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

'దైవభక్తిని మించిన మార్గం మరొకటి లేదు'



నిజాంసాగర్(జుక్కల్): దైవ భక్తిని మించిన మార్గం మరొకటి ఉండదని, భక్తి మార్గంలో యువత నడుచుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సూచించారు. బుధవారం రాత్రి జుక్కల్ మండల కేంద్రంలో అయ్యప్పస్వామి మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును స్వాములు ఘనంగా సన్మానించారు.

నాణ్యత లోపిస్తే ఆందోళన చేస్తాం



బెడ్ వేయకుండా సైడ్ వాల్స్ నిర్మిస్తున్న డ్రెయినేజీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో డ్రైనేజీ, కల్వర్టుల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే ఆందోళన చేస్తామని స్థానికులు హెచ్చరించారు. మండల కేంద్రంలోని కల్లు దుకాం వద్ద, కొత్త రాములు కిరాణం దుకాణం వద్ద డ్రైనేజీ, కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నారు. నిర్మాణంలో నాణ్యత లోపం ఉన్నట్లు గ్రామస్తులు మండిపడుతున్నారు. డ్రైనేజీ నిర్మాణంలో బెడ్డు వేయకుండానే సైడ్ వాల్స్ నిర్మిస్తుండడంతో మాజీ ఎంపీపీ ముదాం సాయిలుతో పాటు పలువురు ఏఈని నిలదీశారు. సీసీ బెడ్డు వేయకపోతే సైడ్‌వాల్స్ ఎలా ఆగుతాయని ప్రశ్నించారు. దీంతో తనకేమీ తెలియదని నేను ఇన్‌చార్జిగా వచ్చానని ఏఈ పేర్కొనడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై డీఈ గిరిని వివరణ కోరగా తాను శుక్రవారం వచ్చి పరిశీలిస్తానన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



లింగంపేటలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సురేందర్



మెల్లకుంటతండాలో .. ఆర్డీవో ప్రభాకర్



తిమ్మాపూర్‌లో..



బ్రాహ్మణపల్లిలో..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడంతో క్షేత్ర స్థాయిలో అధికారులు, లబ్ధిదారుల ఎంపిక కోసం గురువారం సర్వే ప్రారంభించారు. అధికారులు ఆయా గ్రామాల్లో వేసిన ఇందిరమ్మ కమిటీల సాయంతో సర్వే చేస్తున్నారు. ఈ సర్వే ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తున్నారు. ప్రజల నుంచి అవసరమైన వివరాలను సేకరిస్తున్నారు. పలు అధికారులు ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును పరిశీలించారు. ప్రజలు కూడా సర్వేకు సహకరించాలని కోరుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జనగామలో..



కృష్ణాజీవాడిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

క్రీడలతో మానసిక ఉల్లాసం



బాన్సువాడలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



బిచ్కుందలో.. ఎంపీడీవో గోపాల్, ఎస్సై మోహన్‌రెడ్డి



మద్నూర్‌లో ట్రోఫీ అందుకుంటున్న విద్యార్థులు



పెద్దకొడప్‌గల్ జిల్లా పరిషత్ పాఠశాలలో.. ఎంపీడీవో సూర్యకాంత్

క్రీడలతో మాసికం ఉల్లాసం లభిస్తుందని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. గురువారం సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం సీఎం కప్ క్రీడా పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బీబీపేటలో.. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి



గాంధారిలో.. ఎంపీడీవో రాజేశ్వర్



దోమకొండలో..



తాడ్వాయి ఉన్నత పాఠశాలలో..



విజేతలకు షీల్డ్‌ను అందజేస్తున్న నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి



గర్గుల్ క్రీడాకారులకు ట్రోఫీని బహూకరిస్తున్న ఎంఈవో ఎల్లయ్య

సంక్షిప్తం

ఎంఈవో కార్యాలయానికి తాళం




బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయానికి తాళం వేసి ఉంది. గురువారం మధ్యాహ్నం 2 గంటలవుతున్నా కార్యాలయం తెరుచుకోలేదు. పని నిమిత్తం వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కార్యాలయం ముందు పడిగాపులు కాశారు. ఎంతకీ కార్యాలయం తెరుచుకోకపోవడంతో నిరాశతో వెనుదిగి వెళ్లిపోయారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉన్నారు. దీంతో వారు కార్యాలయానికి రావడం లేదు. ఎంఈవో వచ్చి కార్యాలయం తెరిచి ఉంచాల్సిన బాధ్యత ఉంది. అలా చేయకుండా ఎంఈవో కార్యాలయం గురించి పట్టించుకోకపోవడంతో తాళం వేసి ఉంది. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతి రోజు ఎంఈవో వచ్చే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నర్సరీ పనుల పరిశీలన



పిట్లం(జుక్కల్): చిల్లర్గి, నాగంపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్న నర్సరీ పనులను గురువారం అదనపు డీఆర్‌డీవో, మండల ప్రత్యేక అధికారి వామన్ రావు పరిశీలించారు. నర్సరీ నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మండలంలోని గౌరారం, చిల్లర్గి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో మహేష్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌లు హకీమ్, సతీష్, రవి, జీపీ కార్యదర్శులు వినోద్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో మధ్యాహ్న భోజనం..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీవో సురేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. భోజనం రుచికరంగా పెడుతున్నారా.. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. వంట సరుకులు, గదిపరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్, సిబ్బంది ఉన్నారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష



కామారెడ్డి టౌన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్ల సాధన కోసం ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. పార్టీ జిల్లా కన్వీనర్ బోలేశ్వర్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు, సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేతలు లక్ష్మణ్, రాజు, గంగరాజు, భూపాల్, శేకర్, లింగం పాల్గొన్నారు.